క్లుప్తంగా

న్యాయ అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది తిరుమలరావు

భద్రాచలంఅర్బన్: మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి యం.నీలిమ ఆదేశాల మేరకు స్థానిక జగదీష్ కాలనీలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. వివాహాల నిరోధక చట్టం, వరకట్న నిరోధక చట్టం, విద్యాహక్కు చట్టం, మోటారు వాహనాల చట్టం, మొదలైన చట్టాల గురించి న్యాయవాది పామరాజు తిరుమలరావు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి, సామాజిక సేవకురాలు చిట్టే లలిత, ప్రధానోపాధ్యాయులు రాజా శ్రీనివాస్, మండల్ లీగల్ సర్వీసెస్ సిబ్బంది, అబ్బానీ రమేష్, ఉపాధ్యాయులు జ్యోతికుమార్, శ్రీనివాస్తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ల బదిలీ

అశ్వాపురం: మండల పరిధిలోని అశ్వాపురం, మల్లెలమడుగు సెక్టార్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లను బుధవారం బదిలీ చేసినట్టు ఐసీడీఎస్ బూర్గంపాడు ప్రాజెక్ట్ సీడీపీఓ ప్రమీల ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతధికారుల ఆదేశాల మేరకు అశ్వాపురం సెక్టార్ సూపర్‌వైజర్ ధనలక్ష్మిని దుమ్ముగూడెం, మల్లెలమడుగు సెక్టార్ సూపర్‌వైజర్ జగదాంబను చర్ల బదిలీ చేసినట్టు, ఇద్దరికి బుధవారం రిలీవ్ ఆర్డర్లు ఇచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ నెల 10న 'ఐసీడీఎస్ అధికారుల బదిలీలు'అని సాక్షిలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే.

జీఓ నం.3ను తేల్చాకే పదోన్నతులు ఇవ్వాలి

మణుగూరుటౌన్: ఏజెన్సీ ప్రాంత ప్రజలకోసం ఏర్పాటు చేసిన జీఓ నం.3పై తేల్చిన తరువాతే ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలని టీఎస్ టీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలోని ఖాళీగా ఉన్న టీచర్ ఉద్యోగాలను స్థానిక గిరిజనులకే ఇచ్చేలా జీఓ నంబర్ 3ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2000ల సంవత్సరంలో తీసుకొచ్చిందని, దీనిపై కోర్టులో నడిచిన కేసులన్నీ గిరిజనులకు అనుకూలంగానే తీర్పులొచ్చాయని అన్నారు. ఆ మేరకు తెలంగాణ ప్రభుత్వం వాటిని అమలు చేస్తూ ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని కోరారు. ట్రైబల్ అడ్వయిజరీ కౌన్సిల్ నిర్వహించి అసెంబ్లీలో ఆర్డినెన్స్ చేసి దీనిపై చట్టబద్ధత కల్పించేంత వరకు ఏజెన్సీలో పదోన్నతులు ఆపాలన్నారు. లేని పక్షంలో ఏజెన్సీ ప్రాంత గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఉద్యమిస్తాయని హెచ్చరించారు.

కఠినంగా శిక్షించాలి

గుండాల: మహీంద్ర యూనివర్సిటీలో ర్యాగింగ్ చేసిన బండి సాయి భగీరథ్‌ను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకార్యదర్శి ఎస్‌కె. షాహెద్ డిమాండ్ చేశారు. అహంకారంతో తోటి విద్యార్థి అని చూడకుండా ర్యాగింగ్ చేసి అసభ్యపద జాలంతో, భౌతికంగా దాడికి పాల్పడిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి పునరావృతం కాకుండా ర్యాగింగ్ చట్టాలను అమలు చేయాలని కోరారు.

ఫైనల్‌కు చేరిన టోర్నీ



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందిస్తున్న నిర్వాహక ప్రతినిధులు

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వారం రోజులుగా 15వ యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ రసవత్తరంగా సాగుతుంది.బుధవారం జరిగిన సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో కొత్తగూడెం పండు స్ట్రయికర్స్ ఎలెవన్ జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 114 పరుగులు చేసింది. 145 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన బూర్గంపాడు మనీ ఎలెవన్ జట్టు 14.2 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 148 పరుగులు చేసి విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. మధ్యాహ్నం జరిగిన రెండవ సెమీ ఫైనల్ మ్యాచ్‌లో పాల్వంచ శ్రీరామ్ ఎలెవన్ జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. అనంతరం 142 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన అశ్వాపురం జెమిని ఎలెవన్ జట్టు 4 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి ఓటమి పాలైంది. గురువారం బూర్గంపాడు, పాల్వంచ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించనుంది.

గ్రామ పంచాయతీలకు మహర్దశ!

- నియోజకవర్గంలో 29 జీపీలకు పక్కా భవనాలు
- ఉపాధి హామీ కింద రూ.5కోట్ల 80లక్షలు మంజూరు
- సాకారం కానున్న సొంత భవనాల కల
- ఫలించిన ఎమ్మెల్యే కృషి



అద్దె భవనంలో కొనసాగుతున్న పాత అల్లిగూడెం పంచాయతీ కార్యాలయం..

అశ్వారావుపేటరూరల్: ఎన్నో ఏళ్లుగా పక్కా భవనాలు లేక అద్దె భవనాలు, పాఠశాల భవనాల్లో సాగుతున్న కొత్త గ్రామ పంచాయతీలకు మహర్దశ పట్టనున్నది. పరిపాలనకు భవనాలు, సౌకర్యాలు లేక సర్పంచ్‌లు, కార్యదర్శులతోపాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రత్యేక కృషితో ఎట్టకేలకు పక్కా భవనాలకు నిధులు మంజూరయ్యాయి. శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీలకు సైతం నిధులు కేటాయింపు జరగడంతో హర్షం వ్యక్తం అవుతోంది.

29 పంచాయతీలకు ఊరట..

అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, చంద్రుగొండ మండలాల్లోని మొత్తం 29 గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరు అయ్యాయి. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటైన పంచాయతీలతోపాటు, పూర్తిగా శిథిలావస్థలో ఉన్న పంచాయతీలకు సైతం కొత్త భవనాలను మంజూరు చేసింది. పక్కా భవనాల నిర్మాణాలకు జాతీయ ఉపాధి హామి పథకం కింద నిధులను కేటాయించగా, ఐదు మండలాల్లోని 29 భవనాలకు రూ.5కోట్ల80లక్షల నిధులు మంజూరు చేసింది. భవనాలకు స్థలాలు లేని చోట రెవెన్యూ శాఖ ద్వారా స్థలాలను గుర్తించి కేటాయించనున్నారు. పక్కా భవనాల్లో ఏలాంటి ఇబ్బందులు లేకుండా సర్పంచ్, కార్యదర్శికి ప్రత్యేక గదులను కేటాయించేలా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ భవనాల నిర్మాణాలు మొదలైతే అద్దె ఇళ్లలో సాగుతున్న గ్రామ పంచాయతీలకు ఊరట లభించనున్నది. ప్రభుత్వానికి అద్దె కట్టే భారం సైతం తగ్గనుంది.

మంజూరైన పక్కా భవనాలు ఇవే..

నియోజకవర్గంలోని అశ్వారావుపేట మండలానికి 10 గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరు కాగా.. ఒక్కొక్క భవనానికి రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయించారు. వీటిలో అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీ, కేశప్పగూడెం, మద్దికొండ, మల్లాయిగూడెం, నారంవారిగూడెం కాలనీ, నారాయణపురం, పాత అల్లిగూడెం, తిరుమలకుంట, వేదాంతపురం, వినాయకపురం గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు మంజూరు అయ్యాయి. మండలంలో ఇంకా పక్కా భవనాలు లేని పంచాయతీలు పదుల సంఖ్యలో ఉండగా, వీటికి కుడా పక్కా భవనాలు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే విధంగా చంద్రుగొండ మండలంలో రేపల్లెవాడ, వెంకటాయ తండా, దమ్మపేట మండలంలో ఆర్లపెంట, బాలరాజుగూడెం, గున్నేపల్లి, కొమ్ముగూడెం, మారప్పగూడెం, నాచారం, రాచురుపల్లి(లచ్చాపురం), తాటి సుబ్బన్నగూడెం, ములకలపల్లి మండలంలో కమలాపురం, మాధారం, మూకమామిడి, ముత్యాలంపాడు, రాచన్నగూడెం, సీతాయిగూడెం, తాళ్లపాయి, అన్నపురెడ్డిపల్లి మండలంలో భీమునిగూడెం, రాజాపురం గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలను మంజూరు చేశారు.

దశల వారీగా మంజూరు



నియోజకవర్గంలోగల కొత్త, శిథిలమైన పంచాయతీలకు పక్కా భవనాల కోసం ప్రతిపాదనలు చేశాం. వీటిలో తొలి విడతగా అశ్వారావుపేట నియోజకవర్గానికి 29 పక్కా భవనాలకు నిధులు వచ్చాయి. ఇంకా అవసరమైన చోట రెండో విడతలో మంజూరవుతాయి. వీటిని కూడా సాధ్యమైనంతా త్వరలో మంజూరు చేసే విధంగా కృషి చేస్తా.

– మెచ్చా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే, అశ్వారావుపేట

ఆలయ హుండీ లెక్కింపు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం వద్దఉన్న చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. దేవదాయ శాఖ కొత్తగూడెం జిల్లా పరిశీలకులు పి.బెయిల్ సింగ్ ఆధ్వర్యంలో ఆలయంలోని హుండీలను తెరిచి, లెక్కించగా ఈ గతేడాది డిసెంబర్ 20వ తేదీ నుంచి ఈ నెల 18వ తేదీ వరకు రూ.53,948 రూపాయాల ఆదాయం వచ్చినట్లు పరిశీలకులు తెలిపారు. ఆ తర్వాత ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద దుకాణాలను ఏర్పాటుకు వేలం పాటలు నిర్వహించారు. జాతర ఉత్సవాల్లో కొబ్బరి కాయల దుకాణానికి రూ.2,52,000 రూపాయాలు, టెంట్ హౌస్‌కు రూ.2,51,500 రూపాయాలు, మినరల్ వాటర్ పాటను రూ.15వేలకు ఎం.దమరేశ్వరెడ్డి అనే వ్యాపారి దక్కించుకున్నారు. అలాగే హోటల్, కూల్ డ్రింక్స్ షాపును రూ.90వేలకు, కొబ్బరి చిప్పల సేకరణకు రూ.50వేల రూపాయాలకు కొర్సా రాము అనే వ్యాపారి, లడ్డూ పులిహోర పాటను రూ.24వేల రూపాయాలకు ఏరువాక మహేశ్వరరావు అనే వ్యాపారి కైవసం చేసుకున్నారని, ఈ వేలం పాటలు దక్కించుకున్న వ్యాపారులకు ఏడాది పాటు నిర్వహించుకోవచ్చని ఆలయ ఈఓ తెలిపారు. అదే విధంగా త్వరలో జరిగే జాతర ఉత్సవాల సమయంలో కొబ్బరికాయల దుకాణాన్ని రూ.80,500, కొబ్బరి చిప్పల సేకరణ పాటను రూ.45,000వేలకు కొర్సా రాము అనే వ్యాపారి దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ బి.సూర్యప్రకాష్‌రావు, అర్చకులు ప్రసాద్, సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: దాడికి పాల్పడిన వ్యక్తిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని జమ్మిగూడెం గ్రామానికి చెందిన ఎస్.పోతురాజు కుటుంబ కలహాల కారణంగా తన భార్య సరోజినిపై దాడి చేయగా, ఆమె చెల్లి శ్యామల అడ్డుకోబోయింది. దీంతో ఆమెపై కూడా దాడి చేశాడు. శ్యామల భర్త మనుగొండ శ్రీను ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: కోడి పందేల స్థావరంపై బుధవారం రాత్రి స్థానిక పోలీసులు దాడి చేశారు. ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కేశప్పగూడెం గ్రామ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తుండగా, రూ.5,800 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిపక్ష నేతల ముందస్తు అరెస్ట్



ములకలపల్లి: పోలీస్‌స్టేషన్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని ప్రతిపక్ష నేతలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. బుధవారం ఖమ్మంలోని బీఆర్ఎస్ సభ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరుగకుండా ఉండటానికి బీజేపీ, బీఎస్పీ, కాంగ్రెస్‌పార్టీల నేతలను మణుగూరు పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్టైన వారిలో బీజేపీ నేతలు పున్నం బిక్షపతి, రమేష్, బీఎస్పీ నేత ఇర్పా రవితోపాటు ఇతర నేతలు ఉన్నారు.

ములకలపల్లి: ఖమ్మంలో సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో స్థానిక ప్రతిపక్ష నాయకులను పోలీసులు బుధవారం ముందస్తు అరెస్ట్‌చేసి, పోలీస్‌స్టేషన్ తరలించారు. కాంగ్రెస్ నాయకురాలు, జెడ్పీటీసీ సున్నం నాగమణితోపాటు, ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు, అదేవిధంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులను పోలీసులు మందస్తు అరెస్ట్ చేశారు.

అరెస్టులను ఖండించండి

గుండాల: ఖమ్మంలో జరిగిరన బహిరంగ సభ నేపథ్యంలో న్యూడెమోక్రసీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంపీపీ ముక్తి సత్యం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కీలక పాత్ర పోషించిన న్యూడెమోక్రసీని నేడు నిర్బంధానికి గురిచేయడం సరైంది కాదన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లె ప్రయత్నంలో ముందస్తు అరెస్టులు చేయడం అవమానకరమని తెలిపారు. ప్రజాస్వామిక హక్కులను కాలరాయడమే దీనికి నిదర్శమన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఖమ్మంలో బీఆర్ఎస్ సభ నేపథ్యంలో పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మా రాంబాబు అన్నారు. ఈ మేరకు బుధవారం గుమ్మడి శ్రీను నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, టీపీసీసీ సభ్యులు తాండ్ర ప్రభాకర్ తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులను అరెస్ట్లు, గృహ నిర్బంధం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బుక్కురి బుజ్జిబాబు, ఏర రామకృష్ణ, సంకుల చంద్రరావు, దొరబాబు ఉన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం టీడీపీ, ఇతర సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు పంచిపెట్టారు. వక్తలు మాట్లాడుతూ.. సినీ పరిశ్రమలో ఆయన స్థాయిని, సీఎంగా చేసిన సేవలను గుర్తు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ, కమ్మసంఘం నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ములకలపల్లి: పతాకావిష్కరణ చేస్తున్న తేళ్ల చెన్నయ్య



బూర్గంపాడు: ఎన్టీఆర్ వర్ధంతి సభలో టీడీపీ నాయకులు



భద్రాచలంటౌన్: ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

పండగ పూట ప్రయాణ భారం



బస్సులు లేక వెలవెలబోతున్న భద్రాచలం బస్టాండ్

ఇల్లెందు/భద్రాచలంటౌన్: పండుగ సెలవులకు వచ్చి తిరుగు ప్రయాణం కోసం భద్రాచలం బస్టాండ్‌కు వచ్చిన పలువురు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభకు భద్రాచలం డిపో నుంచి సుమారు 50 బస్సులను అద్దెకు తీసుకున్నారు. దీంతో భద్రాచలం బస్టాండ్ వెలవెలబోగా, బస్సులు సరిపడక చాలా రూట్లలో సర్వీసులు రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. భద్రాచలం డిపోలో ఉన్న బస్సుల్లో 50 ఖమ్మం సభకు వెళ్లగా.. 40 బస్సులు మాత్రమే రోజంతా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. ఇందులోనూ వెంకటాపురం, చర్ల, ఖమ్మం రూట్‌లో రెండేసి బస్సులు నడిపి మిగతావి హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాలకు తిప్పారు. కాగా, ఆర్టీసీ బస్సులు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న ఆటోలు, ప్రైవేట్ వాహనాల యజమానులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడమే కాక చార్జీలు పెంచారు. ఇక ఇల్లెందు బస్టాండ్‌లోనూ అదే పరిస్థితి కనిపించింది. కాసేపు వేచి ఉన్న ప్రయాణికులు ఇక బస్సులు రావని తెలియడంతో ఇంటిముఖం పట్టారు. దీంతో బస్టాండ్ వెలవెలబోతూ కనిపించింది. ఒకటి, రెండు బస్సులు కేవలం కొత్తగూడెం మార్గంలో నడవగా, ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేశారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి



మణుగూరుటౌన్: కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు



కరకగూడెంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నేటి నుంచి చేపట్టనున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రమాదేవి, తహసీల్దార్ కె.నాగరాజు, ఎంపీడీఓ వీరబాబు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం..

మణుగూరు మున్సిపాలిటీలో కంటివెలుగు కార్యక్రమాలపై బుధవారం మణుగూరు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ విస్తృత ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీలో కంటివెలుగు పరీక్షా కేంద్రాలను మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి ఎంఏ అలీం, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక అధికారులకు సూచించారు. మణుగూరు మున్సిపాలిటీలోని ప్రధాన కూడళ్ల వద్ద, బస్టాండ్ ప్రాంతాల్లో కంటివెలుగు షెడ్యూల్స్ సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

మాక్ డ్రిల్..

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంపై పర్ణశాల పీహెచ్‌సీలో వైద్యాధికారులు బుధవారం మాక్ డ్రిల్ చేపట్టారు. ఈ సందర్భంగా పర్ణశాల పీహెచ్‌సీ డాక్టర్ రేణుక రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు గురువారం నుండి కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొనేవారు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. గురువారం జరిగే ఈ కార్యక్రమాన్ని బుధవారం పీహెచ్‌సీలో కంటి వెలుగు కార్యక్రమం ఏ విధంగా నిర్వహించాలో మాక్ డ్రిల్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రామలక్ష్మి,హెచ్.వి అనసూర్య,హెచ్ఎ నాగేశ్వరరావు, ఎల్‌డీసీ చెంచయ్య, డీఈఓలు నాగరాజు, రాజు, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం!

కరకగూడెం: కంటి వెలుగు కార్యక్రమాల నిర్వహణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కంటి వెలుగుల క్యాంపు మెడికల్ ఆఫీసర్ బైరిశెట్టి దుర్గనరేష్ తెలిపారు. ఈ మేరకు ఆయయన బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. క్యాంపుల నిర్వహణకు పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

గుండాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు గురుకుల కళాశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆళ్లపల్లి మండలంలోని రాయిపాడు గ్రామంలో ప్రారంభిస్తున్న వైద్యాధికారులు తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

ఖమ్మంలో సీఎం కేసీఆర్ బుధవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభకు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రాంతీయ అధినాయకుల ఆధ్వర్యంలో పదుల కొద్దీ ప్రత్యేక బస్సులు, ట్రాక్టర్లలో జనం పయనమయ్యారు. టాటా మ్యాజిక్, ఏస్ వాహనాలను రంగంలోకి దించారు. వ్యక్తగత కార్లలోనూ పలువురు సభకు చేరుకున్నారు. వాహనాల్లో జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేస్తూ ప్రయాణం చేశారు. పార్టీ ముఖ్య నాయకులు జన సమీకరణపై దృష్టి సారించి ప్రజలను తీసుకెళ్లడంలో ముఖ్యపాత్ర పోషించారు.

– సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న విప్ రేగా కాంతారావు



అన్నపురెడ్డిపల్లి: సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



చంద్రుగొండ : ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



దమ్మపేట: బయలుదేరేందుకు సిద్ధమవుతూ..



భద్రాచలం: సభకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు



అశ్వారావుపేటరూరల్: జెండా ఊపి ప్రయాణాన్ని ప్రారంభిస్తూ..



కరకగూడెం: సభకు బస్సులో వెళ్తున్న కార్యకర్తలు



దుమ్ముగూడెం: రేగుబల్లి పంచాయతీ నుంచి..



గుండాల: మండల కేంద్రం నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులు



మణుగూరుటౌన్: పగిడేరు నుంచి బస్సులో సభకు వెళ్తున్న కార్యకర్తలు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

బి. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యూసుఫ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాప్రసాద్ -79979 58226 | టోల్ ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి — పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమన శుభాకాంక్షలు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416